వంగరను వీడని గజరాజులు

ప్రజాశక్తి-వంగర

వారం రోజులు క్రితం వంగర మండలంలోకి ప్రవేశించిన గజరాజులు ఇంకా మండలాన్ని వదిలి వెళ్లడంలేదు. బుధవారం సాయంత్రం మడ్డువలస సమీపంలోని వంగర రాజాం ప్రధాన రహదారిపైన ఏనుగులు సంచరించడంతో కొంత సమయం రాకపోకలకు అంతరాయం కలిగింది. అయితే ఇవి గత మూడు రోజులుగా సంగాం, మడ్డువలస సమీప పొలాలలో తిష్ట వేసి చెరకు, వరి నార్లు, పామ్ ఆయిల్ మొక్కలు, తేగలు తదితర పంటలను ధ్వంసం చేస్తుండడంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఏనుగుల కదలికలను పార్వతీపురం మన్యం అటవీ శాఖ రేంజ్ అధికారి కె. మణికంఠేష్ పరిశీలించారు.

వ్యాధుల సీజన్ వచ్చేసింది

• పడకేసిన పారిశుధ్యం • కంపుకొడుతున్న గ్రామాలు • పట్టని పాలకులు

ప్రజాశక్తి - సంతకవిటి/గజపతినగరం రూరల్

అసలే వర్షాలు..ఆపై అపారిశుధ్యం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. వర్షాలతోపాటు వ్యాధుల సీజన్ కూడా వచ్చేసింది. వారం రోజులుగా ముసురు నెలకొనడంతో గ్రామాల్లో ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోయి గ్రామాలు కంపుకొడుతున్నాయి. ఎక్కడ చూసినా పారిశుధ్యం పడకేసింది. గ్రామాల్లో అపారిశుధ్యం పేరుకుపోవడంతో దోమలు పెరిగి జ్వరాలు, వ్యాధులు వచ్చే ప్రమాదకర పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. కొద్దిరోజులుగా వర్షాలు పడుతుండడంతో వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. ఉష్ణోగ్రతలో తేమ శాతం, వర్షపాతం వంటివి ఆరోగ్యంపై నేరుగా ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

గజపతినగరం మండలంలో మరుపల్లి, లింగాలవలస, మధుపాడ, భూదేవి పేట, పురిటిపెంట, లింగాలవలస, గంగచోళ్ల పెంట తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. వీధుల్లో మురికి కాలువల్లో చెత్త పేరుకుపోయి మురుగు నీరు రోడ్లపైకి రావడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో కాలువల్లో పేరుకుపోయిన చెత్తను నెలలు తరబడి తీయకపోవడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో వ్యాధులు, జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారుల పక్కన, వీధుల్లో మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంతకవిటి మండలంలోని 34పంచాయతీలు ఉన్నాయి. గ్రామాలన్నింటిలోనూ అపారిశుధ్యం తాండవిస్తోంది. రోడ్లు పక్కన చెత్త వేస్తున్నారు. సిరిపురంలోని హెచ్చరిక బోర్డులు ఉన్నప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. సంతకవిటి, తలాడ, ఎస్.అగ్రహారం, గోళ్ళవలస, వాసుదేవాపట్నం, తమరాం, మోదుగులపేట, గరికిపాడు, కావలి, కొండగూడెం, మంతిన, మల్లయ్యపేట, మందరాడ తదితర గ్రామాల్లో రోడ్డు పక్కనే చెత్తను వేస్తున్నారు. పందులు, కుక్కలకు ఈ చెత్తే నివాస స్తావరాలు గా ఏర్పరచుకుంటున్నాయి. గ్రామాల్లో కాలువలలో చెత్త తీయకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సంతకవిటి, సిరిపురం, ఎం. ఆర్. అగ్రహారం, గోళ్ళవలస, గరికిపాడు తదితర గ్రామాల్లో చెరువుల్లో చెత్త వెయ్యడంతో ప్రజలు మరింత రోగాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. ఈనేపథ్యంలో రెవిన్యూ, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. తక్షణమే అధికారులు స్పందించి చెత్తను తొలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

గజపతినగరం : మరుపల్లి దిగువవీధిలో రోడ్డు ప్రవహిస్తున్న మురుగునీరు

సంతకవిటి సచివాలయం పక్కన కాలువలో పేరుకుపోయిన చెత్త

ఆసుపత్రులకు పెరుగుతున్న రోగులు

మండలంలోని సంతకవిటి, మండవ కురిటిలో రెండు పిహెచ్‌సిలు ఉన్నాయి. ఈ ఆస్పత్రులకు ఇప్పటికే రోగుల తాకిడి ఎక్కువైంది. గ్రామ సచివాలయాల్లో ఉన్న హెల్త్ సెంటర్లు, ఆర్ఎంపిల చుట్టూ రోగులు ఇప్పటికే తిరుగుతున్నారు. రానున్న కొద్దీ రోజుల్లో రోగుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఎక్కువగా ఉండడంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది.

చిన్నారిని పరీక్షిస్తున్న సంతకవిటి పిహెచ్‌సి వైద్యులు నాగేంద్ర ప్రసాద్

రైతు సంక్షేమానికే పెద్దపీట

●తాటిపూడి నీటిని మళ్లించే ఆలోచన లేదు
●ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్
●జలాశయం నుంచి సాగునీరు విడుదల

ప్రజాశక్తి-గంట్యాడ

రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గంట్యాడ మండలంలోని బుచ్చి అప్పారావు తాటిపూడి జలాశయం నుంచి సాగునీటిని మంత్రి శ్రీనివాస్ బుధవారం ఉదయం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురవడంతో పంటల సాగుకు అనుకూల పరిస్థితి ఉంటుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎక్కడైనా నీటికి ఇబ్బంది ఏర్పడినా, చెరువులు దెబ్బతిన్నా, వాటిని పునరుద్దరించేందుకు ప్రతిపాదనలు చేస్తే, మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. జిందాల్ భూముల్లో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఇ పార్కుకు నీటి సరఫరాకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలోనే జీఓ వచ్చిందని, అయినప్పటికీ కొంతమంది రాజకీయ లబ్ధికోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి అన్నారు. తాటిపూడి నీటిని విశాఖపట్నం తాగునీటి అవసరాలకు, ఆయుకట్టు రైతులకు మాత్రమే వినియోగిస్తామని, దానిని దారిమళ్లించే ఆలోచన లేదని ఆయన స్పష్టం చేశారు.

ఇరిగేషన్ ఎఇ ఎం.వెంకటరమణ మాట్లాడుతూ కాలువల మరమ్మత్తులకు నిధులు తక్కువ రావడం, ఖరీఫ్ సీజన్ వచ్చేయడంతో పనులను నిలిపివేశామని తెలిపారు. తాటిపూడి రిజర్వాయర్ ఆయకట్టు సంఘం అధ్యక్షులు జగన్నాథం మాట్లాడుతూ తాటిపూడి రిజర్వాయర్ పరిధిలో ఉన్న 15వేల ఎకరాల శివారు భూములు వరకు నీరందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎంవి రమణ, శంకర్, తాహశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎంపిడిఒ రమణమూర్తి, డిఇలు రామునాయుడు, శ్రీచరణ్, తాటిపూడి కూటమి నాయకులు కొండపల్లి కొండలరావు, భాస్కరనాయుడు, రొంగలి కృష్ణ, అల్లు విజయ్‌కుమార్, ఇతర ఆయుకట్టు సంఘాల నాయకులు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

తాటిపూడి నీటిని విడుదల చేస్తున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాఖ మేయర్‌తో కలిసి రహదారులు ప్రారంభం

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మధుపాడ గ్రామస్తుల 30ఏళ్ల కలను నెరవేరుస్తూ, విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి గంట్యాడ మండలంలో నిర్మించిన రెండు రహదారులను బుధవారం మంత్రి ప్రారంభించారు. కృష్ణాపురం హెడ్ వాటర్ వర్క్స్ నుంచి మధుపాడ జంక్షన్ వరకు రూ.134.83 లక్షలతో నిర్మించిన రహదారిని, మధుపాడ జంక్షన్ నుంచి విజయనగరం రహదారి వరకు రూ. 129 లక్షలతో నిర్మించిన రహదారిని వారు ప్రారంభించారు. విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ, మధుపాడ గ్రామస్తుల సమస్యలను తెలుసుకొని ఈ రహదారిని నిర్మించామన్నారు. విశాఖ నగరానికి తాటిపూడి నుంచి త్రాగునీటిని తీసుకోవడం జరుగుతోందని అందుకు కృతజ్ఞతగా సమీప గ్రామమైన మధుపాడకు ఈ రహదారిని నిర్మించామని చెప్పారు. మరో రెండు కిలోమీటర్ల మేర నిర్మించాల్సిన రహదారిని కూడా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. డిసిసిబి చైర్మన్, జిల్లా టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఈనెల 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ల్లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేవిధంగా సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్‌పి వకుల్ జిందాల్, ఆదేశించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కేసుల్లో ఇరు వర్గాలు రాజీ అయ్యేందుకు అవకాశం ఉన్న కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, చిన్న క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, ఇతర కాంపౌండు కేసులను ముందుగా గుర్తించాలన్నారు. ఆయా కేసుల్లో ఇరు వర్గాలతో సంప్రదించి, సమావేశాలు నిర్వహించి, వారు రాజీ అయ్యే విధంగా మానవతా దక్పదంతో వ్యవహరించాలన్నారు. పోలీసు స్టేషను స్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తే కేసులు త్వరగా, సానుకూలంగా రాజీ అయ్యే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

డాక్టర్ పట్టాభిరామ్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రముఖ ఇంద్రజాలికులు, హైప్నోటిస్ట్, సైకాలజిస్ట్ అయిన డాక్టర్ బివి పట్టాభిరామ్ మృతి ఇంద్రజాలం రంగానికి తీరని లోటని నగరానికి చెందిన ప్రముఖ ఇంద్ర జాలికులు చారి పేర్కొన్నారు. పట్టాభిరామ్ మృతికి ఆయనతో పాటు కుమార్తెలు మౌనిక, సుస్మిత సంతాపం తెలిపారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విజయనగరంతో పట్టాభిరామ్‌కు అనుబంధం ఉందని తెలిపారు. ఆయనతో ఉన్న అనుబందాన్ని తలచుకుంటూ వారు చేసిన సేవలు, నేటి తరానికి అందించిన సహకారం మరువ లేనిదని కొనియాడారు. ఇంద్రజాల రంగంలో ఒక దిగ్గజం.. మాణిక్యం కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు.

పత్రాలను చూపుతున్న సీతం, కెఎల్‌యు యాజమాన్య ప్రతినిధులు

కెఎల్‌యుతో 'సీతం' ఒఎంయు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సీతం ఇంజినీరింగ్ కళాశాల కెఎల్ యూనివర్శిటీతో ఒఎంయు కుదుర్చుకుంది. ఈ మేరకు బుధవారం అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం విద్యార్థులలో ఆవిష్కరణ, వ్యవస్థాపకత, ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించడం లక్ష్యంగా సాగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కెఎల్ టెక్నాలజీ ఇంకుబేటర్స్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాబు హరికృష్ణ లంక మాట్లాడుతూ భారతీయ అంకుర సంస్థల పర్యావరణ వ్యవస్థ పాత్ర, పనితీరును వివరించారు. సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ్ రావు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలను సృష్టించడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, డీన్ డాక్టర్ జివిప్రసూన తదితరులు పాల్గొన్నారు.

రథయాత్రకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఒడిశా రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన . పూరి జగన్నాధుని రథ యాత్రకు భక్తుల సౌకర్యార్థం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఈనెల 6న సాయంత్రం బస్సు సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆరోజు సాయంత్ర 4గంటలకు బయలుదేరి భువనేశ్వర్, కోణార్క్ పూరి ఆలయాలను దర్శించుకొని తిరిగి చేరుకునేలా ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు నడపనున్నట్లు తెలిపారు. టికెట్ ధర రూ.2500, www.apsrtconline.in అనే వెబ్ సైట్ ద్వారా టికెట్స్ బుక్ చేసుకొనే సదుపాయం ఉందని తెలిపారు.మరిన్ని వివరాలకు 9959225620, 9494331213, 9440359596 నెంబర్లకు సంప్రదించాలని కోరారు

గంజాయి కేసులో వ్యక్తి అరెస్ట్

కంటోన్మెంట్ :2023 మార్చిలో నమోదైన గంజాయి అక్రమ రవాణా కేసులో వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఒకటో పట్టణ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. 18 కేజీల గంజాయిని సరఫరా చేసిన కోరాపుట్ , ఒడిశా రాష్ట్రానికి చెందిన మూడవ నిందితుడు గిరి పాండే ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా 14రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా ముద్దాయికి 14 రోజులు రిమాండ్ విధించారని పేర్కొన్నారు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఈనెల 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను స్కీం వర్కర్లు, పలు రంగాల కార్మికులు జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు టివి రమణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బైరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మండపంలో సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు అధ్యక్షతన అంగన్వాడీలు, ఆశాలు, మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టివి రమణ మాట్లాడుతూ కార్మిక, కర్శక, సేవారంగం సమస్యలు పరిష్కరించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని భారం మోపి 8గంటల పనిని 10గంటలకు పెంచి చట్టాలను తీసుకువచ్చాయన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. అంతే కాకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 40 కార్మిక చట్టాలను 4లేబర్ కోడ్లు గా చేసి కార్మిక వర్గం పై దాడి చేసి వారికి భద్రత, హక్కులు లేకుండా చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా 9న దేశ వ్యాపిత సమ్మె జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఆరోజు రామతీర్థం జంక్షన్ నుంచి మొయిద జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపడతామన్నారు. సమావేశంలో పి. మంగలక్ష్మి, ఆర్.జయ, టి. బాబురావు, హరిబాబు, అంగన్వాడీలు, ఆశావర్కర్లు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

మండల సమన్వయ కమిటీ ఏర్పాటు

సిఐటియు మండల సమన్వయ కమిటీ గౌరవ సలహాదారు కిల్లంపల్లి రామారావు, కన్వీనర్‌గా బండి హరిబాబు, కమిటీ సభ్యులుగా పి.మంగలక్ష్మి, ఆర్ జయలక్ష్మి, సిహెచ్ అప్పల నారాయణ, పద్మ, బాబురావు, దుర్గారావు, పతి వాడ లక్ష్మణరావు, ఎన్నికయ్యారు.

సమ్మెలో ఆశావర్కర్లంతా పాల్గొనాలి

విజయనగరం టౌన్ :కార్మిక హక్కులు కోసం, చట్టాలను కాపాడుకునేందుకు జరిగే జాతీయ సమ్మెలో ఆశా వర్కర్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం ఎల్‌బిజి భవన్ లో ఆశా వర్కర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఆశా వర్కర్లు కార్మికులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, నియమకాలు ప్రభుత్వమే చేపట్టాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న సమ్మెలో ఆశా వర్కర్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి బి. సుధారాణి, మహాలక్ష్మి, పద్మ, సిఐటియు నగర సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు ఎ.జగన్మోహన్, బి.రమణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు టివి రమణ

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నోటీస్

పూసపాటిరేగ: కార్మిక సంఘాల పిలుపు మేరకు నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు సైతం సమ్మెలో పాల్గొ పాల్గొంటారని ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం పూసపాటిరేగ ఎంఇఒ కార్యాలయానికి సమ్మె నోటీసు అందజేశారు.సిఐటియు నాయకులు బి.సూర్యనారాయణ, దిబ్బడి కంచమ్మ దిబిడి నాగమణి, గుర్రాన్ని అప్పల నరసన్న, షేక్ అబీనా పాల్గొన్నారు.

టిడిపి నాయకుల తొలిఅడుగు

దూరంగా జనసేన, బిజెపి

కరపత్రాల్లో లేని నాయకుల ఫొటోలు

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ద్వారా టిడిపి నాయకులు ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాన్ని మండలంలోని కొత్త శ్రీరంగ రాజపురంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మక్కువ శ్రీధర్, గంట్యాడ శ్రీదేవి ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో చేసిన అభివృద్ధితో పాటు, వచ్చే నాలుగేళ్లలో చేయబోతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పివివి గోపాల రాజు, ఎస్.రామ్‌కుమార్, వివి ప్రదీప్ కుమార్, అరుణ కుమారి, చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

తొలి అడుగుకు దూరంగా జనసేన - బిజెపి

టిడిపి చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి జనసేన, బిజెపి నాయకులు దూరంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వంలో జనసేన, బిజెపి ఉన్నప్పటికీ ఆ పార్టీ నాయకులంతా టిడిపి చేపట్టిన ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి మూడు పార్టీలకు వర్తిస్తుందని కానీ జనసేన, బిజెపి నాయకులను టిడిపి నాయకులు కలుపుకొని వెళ్లడం లేదని ఆయా పార్టీల నాయకులు అంటున్నారు. నియోజక వర్గంలో చేపడుతున్న చాలా వరకు ప్రభుత్వ కార్యక్రమాల్లో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి మర్రాపు సురేష్ తో సహా మిగిలిన ఏ ఒక్క జనసేన నాయకులకు పిలవడం లేదని ఆవేదన చెందుతున్నారు. బిజెపి ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న దుర్గాప్రసాద్‌కు టిడిపి చేపడుతున్న ప్రభుత్వ కార్యక్రమాలకు కనీసం పిలుపు కూడా ఉండడం లేదని తెలిసింది. తొలి అడుగు కరపత్రాలలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులతో పాటుగా తమ అభిమాన నాయకులు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, ప్రధాని మోడీఫోటోలు లేకపోవడంతో ఆయా పార్టీల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మాట్లాడుతున్న కమిషనర్

త్వరలో నగరంలో జోన్లు ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో త్వరలో ఏర్పాటు చేయనున్న జోన్ల విధానానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కోరారు. బుధవారం తన ఛాంబర్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ట్రాఫిక్, వన్ టౌన్, టూటౌన్ ఎస్ఐలు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో పలు అంశాలపై చర్చించారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందు లేకుండా, నగర క్రమబద్ధీకరణకు మూడు జోన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌన్సిల్ అనుమతి అనంతరం జోన్ల విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు చెప్పారు. రెడ్, అంబర్, గ్రీన్ జోన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వీధివిక్రయదారుల సర్వేను చేపడుతున్నామని మరో వారం రోజుల్లో సర్వేను పూర్తి చేసి గుర్తింపు కార్డులను అందజేయనున్నామని చెప్పారు. పశు సంచారాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక టీములు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు, వన్ టౌన్ ఎస్ఐ గణేష్,టూ టౌన్ ఎస్ఐ మురళి, టి పిఒ అప్పలరాజు, టిపిఎస్ అనిత పాల్గొన్నారు.

కొండచరియలు విరిగిపడి 30 గొర్రెలు మృతి

ప్రజాశక్తి-వేపాడ

గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొండచరియలు విరిగిపడి 30 గొర్రెలు మృతిచెందిన ఘటన వేపాడ మండలం రామస్వామి పేటలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామ మాజీ సర్పంచ్ పత్రి బాలకృష్ణకు చెందిన గొర్రెలు ఎప్పటి మాదిరిగానే ఊరమెట్టపై మేతకు వెళ్లాయి. ఉదయం నుంచి కఃరుస్తున్న ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో కొండచరియలు విరిగిపడడంతో గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. తన జీవనాధారమైన గొర్రెలు మృతి చెందడంతో ప్రభుత్వం ఆదుకోవాలని బాలకృష్ణ కోరారు.

మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న గ్రామస్తులు

విద్యుత్ స్తంభం విరిగిపడి మూడు పశువులు మృతి

శృంగవరపుకోట : ఎస్.కోట పంచాయతీ కర్రివాని కల్లాల వద్ద విద్యుత్ స్తంభం విరిగిపడి వేమలి రవణమ్మకు చెందిన రెండు చూడి గేదలు, ఒక పెయ్యి మృతి చెందాయి. వీటి విలువ సుమారు రెండు లక్షల వరకు ఉంటుందని రమణమ్మ భర్త వెంకటరమణ తెలిపారు. పశువర్ధక శాఖ అధికారులు పశువుల ట్యాగ్ నెంబర్‌ను నమోదు చేసుకుని ప్రభుత్వ పరంగా నష్టపరిహారం వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఘోషాస్పత్రిలో బాలింతలతో మాట్లాడుతున్న చైర్మన్ డివిజి శంకరరావు

జిజిహెచ్, ఘోషాలో ఎస్‌టి సెల్ ఏర్పాటు చేయాలి

పారామెడికల్ సిబ్బందిని నియమించాలి

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి , ఘోషాసుపత్రులలో షెడ్యూల్ తెగల ప్రజలకు సహాయం కోసం ప్రత్యేకంగా ఎస్‌టి సెల్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి , ఘోషాసుపత్రులలో ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పలు విభాగాలను తనిఖీ చేసారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, భోజన నాణ్యత, సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఘోషాసుపత్రిని సందర్శించి వార్డులను తనిఖీ చేసారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలు గూర్చి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ఆసుపత్రికి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పన, సిబ్బంది వివరాలు తదితర అంశాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఛైర్మన్ డాక్టర్ శంకరరావు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఘోషాసుపత్రులలో ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, ప్రజల అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకుని అవసరమైన సేవలు ఏర్పాటు గురించి ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఆసుపత్రిని సందర్శించామని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ అప్పలనాయుడు, ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ శభశ్రీ, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి : డిసిసిబి ఛైర్మన్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఖాతాదారులకు, రైతులకు మెరుగైన సేవలు అందించాలని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున సూచించారు. బుధవారం స్థానిక విటి అగ్రహారంలోని డిసిసిబి బ్రాంచిని ఆయన సందర్శించారు. బ్యాంకు ద్వారా అందుతున్న సేవలపై ఆరాతీశారు. బ్రాంచి పరిసరాలు అధ్వానంగా ఉన్నాయని, మెరుగు పరచాలని సూచించారు. రైతులకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్థిక సేవలు అందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించాలని సిబ్బందికి చెప్పారు. డిపాజిట్లను పెంచాలని తెలిపారు. ఇతర బ్యాంకులకు దీటుగా సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డిజిఎం వాసు, బ్రాంచ్ మేనేజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కిమిడి నాగార్జున

లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలి

ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ శ్రీనాథుడు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ బి.శ్రీనాధుడు తెలిపారు. లైసెన్స్ లేని వ్యక్తుల (అనధికార వ్యక్తుల) వద్ద నుండి మద్యం కొనుగోలు చేయడం చాలా ప్రమాదకరమని తెలిపారు. అటువంటి మద్యం నకిలీది కావచ్చని, వివాహాలు, పార్టీలు లేదా ఇతర సామూహిక వేడుకల సందర్భాలలో మద్యం తగ్గింపు ధరలకు సరఫరా చేస్తామని చెప్పేవారు మిమ్మల్ని మోసం చేసే అవకాశముందని పేర్కొన్నారు. వారు సరఫరా చేసే నకిలీ మద్యం మీ ఆరోగ్యానికి తీవ్రమైన హానిని కలిగిస్తుందని తెలిపారు. అటువంటి అనుమానిత వ్యక్తుల వివరాలను వెంటనే ఎక్సైజ్ శాఖకు టోల్ ఫ్రీ నంబర్ 14405కు గాని, జిల్లా ప్రొహిబిషన్‌అండ్ ఎక్సైజ్ అధికారి 9440902360 నెంబర్‌కు గాని సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు

ప్రజాశక్తి - చీపురుపల్లి

ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నుండి రాష్ట్రంలో ఉన్న మహిళలందరికీ ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. సుపరిపాలనలో భాగంగా తొలి అడుగు అనే కార్యక్రమంలో మండలంలో గల గుణిద్దాం, నిమ్మలవలస గ్రామాల్లో బుధవారం స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా పరుగులు తీస్తున్నాయన్నారు. రాష్ట్రంలో పలు కంపెనీలను తీసుకువచ్చి నిరుద్యోగులకు వేలాది ఉద్యోగాలను కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రౌతు కాము నాయుడు, ఆర్ఈసిఎస్ మాజీ చైర్మన్ దన్నాన రామచంద్రుడుతో పాటు పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాజాం: ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారం పట్టణంలోని ఒకటవ వార్డు పొనుగుటివలసలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటికి వెళ్లి ఏడాది పాలనలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని, ఎన్నికల ముందు చెప్పినట్లుగా సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతుందని తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే పింఛన్లు పెంపు, తల్లికి వందనం, ఉచిత ఇసుక, దీపం పథకం కింద ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు, అన్న క్యాంటీన్లు ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీ-4 సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఒ, ఎంపిడిఒ, తహశీల్దార్, సచివాలయ ఉద్యోగులు, కూటమి నాయకులు నంది సూర్య ప్రకాశరావు, గురవాన నారాయణరావు, దుప్పల పూడి శ్రీను, శాసపు రమేష్ కుమార్, గార గున్నంనాయుడు, వంగా వెంకటరావు, పిల్ల సత్యంనాయుడు, గిరడ ఉమా, జి.టి నాయుడు, ఎవివి రమణ తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: మండలంలోని ముద్దూరు, బోడసింగిపేట గ్రామాలలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టిడిపి అధ్యక్షుడు కోరాడ కృష్ణ ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలపై ఇంటింట ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బోడసింగిపేట, కెరటం సర్పంచ్‌లు మీసాల జానకీరావు, నంబూరి రాజేష్, మాజీ ఎంపిటిసి పతివాడ రాజినాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బుద్దరాజు సత్యనారాయణరాజు, కళ్యాణపు నారాయణరావు, రాపాక అచ్చం నాయుడు, ఉప్పలపాటి చిరంజీవిరాజు, ఆరికాక శ్రీనివాసరావు, వాళ్ళే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్: విజయనగరం మండలం కొండకరకాం గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు బుధవారం పాల్గొన్నారు. గ్రామ ప్రజలతో సమావేశమై ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దుల నరసింగ రావు, ప్రధాన కార్యదర్శి గంటా పోలినాయుడు, గ్రామ మాజీ సర్పంచ్ పాండ్రంకి గౌరీ నాయుడు, నాయకులు రాంబార్కి రామునాయుడు (రాంబాబు), పట్టణ పార్టీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆల్తి బంగారుబాబు, మహిళా నాయకులు అనురాధ బేగం తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: టిడిపితోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. పట్టణంలోని బుధవారం రాజా నగర్ కాలనీలో ఏడాదిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీలను అమలు చేస్తూ సుపరిపాలన అందిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, పట్టణ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కళా వెంకటరావు

చీపురుపల్లి: కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

విజయనగరం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి

ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

డెంగీ, మలేరియా వంటి వ్యాధులు సోకకుండా ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని రాకోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎసివి అఖిల సూచించారు. బుధవారం రాకోడు పి హెచ్ సిపరిధిలో డెంగ్యూ నివారణ మాసోత్సవాల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జులై నెలంతా డెంగ్యూ నివారణ మాసోత్సవాలుగా నిర్వహిస్తామన్నారు. దోమకాటు నుండి రక్షణ పొందాలని, డెంగ్యూ మలేరియా వ్యాధులను నిర్మూలించాలన్నారు. ప్రతి శుక్రవారం నీటి నిలవలు ఖాళీ చేసి దోమ లార్వాలను నిర్మూలించాలన్నారు. వాడకపు నీటి తొట్టెలను ప్రతి మూడు రోజులకు కొకసారి ఖాళీ చేసి తాజాగా నింపుకోవాలన్నారు. ఇంట్లో ఉన్న ఫ్రిడ్జిలు, ఎయిర్ కూలర్లు మూడురోజులకు కొకసారి శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు కార్తీక్, సిహెచ్ఒ శారదాంబ, పిహెచ్ఎన్ వరలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్లు ఆర్.శ్రీరామమూర్తి, కె.శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ రాజు, ల్యాబ్‌టెక్నీషియన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభ పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం గ్రామంలో జరుగుతున్న గ్రామ సభను బుధవారం ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను తయారు చేసుకుని నిధులు మంజూరుకు ప్రతిపాదనలు తయారు చేసుకునేందుకు ఈ గ్రామ సభలను నిర్వహిస్తోందన్నారు. ప్రజలు ఎన్నుకున్న స్థానిక సర్పంచులు, ఎంపిటిసిలు పాలకవర్గ సభ్యులు ఈ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో తడి పొడి చెత్తను వేరువేరుగా ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామంలోని వాటర్ ట్యాంకును, ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌ను పరిశీలించారు. ఈ సభలో సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తం

ప్రజాశక్తి- కొత్తవలస

డెంగీ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ సూచించారు. పిహెచ్‌సి పరిధిలో గల 8 సచివాలయాల ప్రజలు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్ గునియా, వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన బుధవారం తెలిపారు. తుమ్మికాపల్లిలో సిబ్బంది, ఆశ వర్కర్లు డెంగీ వ్యాధి మాసోత్సవ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ ఎల్. సత్యారావు మాట్లాడుతూ ఇంటి ముందు నీరు నిల్వ ఉండరాదని, ప్రతీ వారం గోలేలు, కుండీలు కడిగి ఆరబెట్టాలని, ఫ్రైడే డ్రై డే పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ఈశ్వరరావు, ఎమ్ఎల్‌హెచ్‌పి కామేశ్వరి, ఏఎన్ఎమ్ జ్యోతి, ఆశ వర్కర్స్ వెంకటలక్ష్మి, జగదీశ్వరి, విజయలక్ష్మి, దత్తి లక్ష్మి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా రమణమూర్తి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా టీవీ రమణమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా టీవీ రమణమూర్తిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. కాగా ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం టీవీ రమణమూర్తి జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఏజీపీగా తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి టీవీ రమణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా నియమితులైన టీవీ రమణమూర్తిని ఎస్.కోట న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు జి.సూరిదేముడు, కార్యదర్శి బీవీఎస్ రామారావు, మాజీ ఏజీపీ అల్లు సత్యాజీ, ట్రెజరర్ బి.త్రిమూర్తులు, మీడియా సెక్రటరీ డబ్ల్యు.ఎన్. శర్మ, ఉపాధ్యక్షుడు బొడ్డు వెంకటరావు, సీనియర్ న్యాయవాదులు వారాది ఈశ్వరరావు, బొడబళ్ల రామకృష్ణ, ఆర్.సత్యనారాయణ, బి.సత్యనారాయణ, ముక్కు అనూరాధ, వియ్యపు రమణ, జి.చిట్టిబాబు తదితరులు అభినందించారు.

కోళ్లఫారం మూతబడే వరకూ నిరసన

ప్రజాశక్తి- మెంటాడ

కోళ్ల ఫారం మూతబడే వరకూ నిరసన ర్యాలీలు, రాస్తారోకోలు చేస్తామని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు తెలిపారు. బుధవారం స్థానిక మెంటాడ సంతతోట నుంచి మండల తహశీల్దార్ కార్యాలయం వరకు కోళ్ల ఫారం మూసివేయాలని కోరుతూ నిరసన ర్యాలీ చేపట్టారు. కోళ్లఫారం మూసివేయాలని పలు నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఈ ర్యాలీలో మండల ప్రజా సంఘాల నాయకులు రెడ్డి రాజప్పలనాయుడు, బిరసాడవలస, మెంటాడ తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. పట్టణంలోని మేదరబంద, రాజానగర్ కాలనీ, మార్కెట్ రోడ్డులో బుధవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పని చేయాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశించారు. రోడ్లు, కాలువలు శుభ్రంగా ఉంచాలన్నారు. కాలువలలో పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. మార్కెట్లో చెత్తను తొలగించి శుభ్రం చేయాలన్నారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

డయాలసిస్ రోగికి పింఛను మంజూరు

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక మున్సిపాలిటీలోని మల్లమ్మపేటకు చెందిన డయాలసిస్ రోగి ఉమాకు పింఛను మంజూరు కావడంతో టిడిపి నాయకులు పి.జనార్దన్, సచివాలయ ఉద్యోగులు బుధవారం అందించారు. పింఛను మంజూరు చేయాలని ఎమ్మెల్యే బేబినాయన అధికారులకు లేఖ రాయడంతో జూన్ నుంచి పింఛను మంజూరు అయింది. ఉమా పేద కుటుంబం కావడంతో మందులు ఖర్చులకు బేబినాయన రూ.10వేలు ఆర్థిక సహాయం చేశారు. బేబినాయనకు రుణపడి ఉంటామని ఉమా అన్నారు.

సైబర్ క్రైమ్ పై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని చిన శిర్లాం గ్రామంలో మత్తు పదార్థాలు, గంజాయి వల్ల కలిగే అనర్థాలు, సైబర్ క్రైమ్ ఫ్రాడ్స్‌పై రాజాం రూరల్ సిఐ ఉపేంద్రరావు బుధవారం సాయంత్రం అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లలపై బాధ్యత వహించాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటయితే భవిష్యత్తు అంధకారమే అన్నారు. యువత భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందన్నారు.

వర్షంతో రైతులకు ఇబ్బందులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ఇప్పటికే వరి నారు మడులను సిద్ధం చేసుకోగా అవి వర్షంతో పూర్తిగా మునిగిపోయాయి. ఇంటికి తెచ్చుకునేందుకు పొలంతో కోసి సిద్ధంగా ఉంచిన నువ్వు పంట కూడా తడిచి ముద్దయిపోంది. వర్షం ఇప్పటికైనా ఎడతెరిపి ఇస్తే తప్ప వరినారు వేసుకునే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'జిందాల్' హామీలు వెంటనే నెరవేర్చాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నిరసన తెలుపుతున నిర్వాసిత మహిళలు

జిందాల్ అల్యూమినియం కర్మాగారం కోసం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా అధికారుల సమక్షంలో జిందాల్ బాధితులకు ఇస్తామన్న హామీలు వెంటనే నెరవేర్చాలని సిపిఎం నాయకుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు. బుధవారం బొడ్డవరలో నిర్వాసిత రైతులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ రైతులనుంచి జిందాల్ తీసుకున్న భూమిని 18 ఏళ్లయినా కంపెనీ నిర్మించకుండా ఉండి, చట్టం ప్రకారం ఎవరు భూమి వారికి అప్పగించకుండా ఇండస్ట్రియల్ రియల్ ఎస్టేట్ పేరుతో తిరిగి చిన్న పరిశ్రమలకు అమ్ముకోవడాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు. నిర్వాసితులకు భూమి అప్పగించి ఉద్యోగ కల్పనకు అవసరమైతే అదే భూమిని రైతుల నుంచి సేకరించాలన్నారు. అప్పుడు జిందాల్ కంపెనీకి భూములు ఇచ్చిన ముసిడిపల్లి, పెద్దకండేపల్లి, కిల్తంపాలెం, బొడ్డవర గ్రామాల ఎండిఆర్, ఎస్ఎఫ్ఎ రికార్డులను పంచాయతీల్లో అందుబాటులో లేకుండా తహశీల్దార్ కార్యాలయంలో దాచేయడానికి కారణాలేంటో తెలియజేయాలన్నారు. ఈ నాలుగు పంచాయతీల రెవెన్యూ రికార్డుల్లో అనేక అవకతవకలు జరిగాయన్నారు. ఈ అవకతవకలపై ప్రత్యేక దర్యాప్తు నిర్వహించాలని కోరారు

రాజధానికి చేరిన జిందాల్ భూ సమస్య

మండలంలోని జిందాల్ భూ సమస్య రాజధానికి చేరింది. షెడ్యూల్డ్ కులాలు కమిషన్ చైర్మన్ కెఎస్.జవహర్‌ను రాజధానిలో జిందాల్ భూ నిర్వాసితులు బుధవారం కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. జిందాల్ కంపెనీ పరిశ్రమ ప్రారంభించనందున తమ భూములు మళ్లీ తమకే ఇప్పించాలని కోరారు. నిర్వాసితులు ముత్యాల సన్యాసిరావు, గుత్తిలి ఈశ్వర రావు, ముత్యాల సన్యాసమ్మ, దేవవరపు శ్రీరాములు, దేవవరపు సింహాచలం, బి.లక్ష్మణరావు, పొడుగు రేవతి, కిలో పైడితల్లి, బంధం విజయ బాబు, కేత వీరన్న, కిలో అర్జున, కె.సన్యాసి రావు, టొంపల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌బిఐ అధికారులు

మంత్రి శ్రీనివాస్‌తో ఎస్‌బిఐ అధికారుల భేటీ

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఎస్‌బిఐ అధికారులు బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలోమర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ ఎం. సురేష్ బాబు ఎస్‌బిఐ అందిస్తున్న రుణాల వివరాలను మంత్రికి వివరించారు. రాష్ట్రంలో నూతన పరిశ్రమలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో పారిశ్రామిక రంగానికి నిబంధనలు మేరకు తమ వంతు రుణాలను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మేనేజర్ బి.శ్రీనివాస్, సిబ్బంది కె.సత్యనారాయణ ఉన్నారు.

ఎస్‌పికి జర్నలిస్టుల ఫిర్యాదు

కంటోన్మెంట్: 10టివి స్టాఫ్ రిపోర్టర్ ఎంఎంఎల్ నాయుడుపై విజయనగరం టూ టౌన్ ఎస్ఐ దౌర్జన్యం చేయడాన్ని జర్నలిస్టులు మరోసారి ఖండించారు. బుధవారం ఎస్‌పి వకుల్‌జిందాల్‌ను కలసి ఎస్ఐపై ఫిర్యాదు చేశారు. ఇప్పటికే కలెక్టర్‌కు, ఎఎస్‌పికి ఫిర్యాదు చేశామని తెలిపారు. పోలీస్‌శాఖ అంటే మీడియాకు ఎంతో గౌరవమని, వారితో మీడియా ఎప్పుడూ సోదర భావంతో ఉంటుందన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అని చెబుతూ... మీడియా ప్రతినిధులపై ఇలా దౌర్జన్యం చేస్తే ఎలా అని ప్రశ్నించారు. ఎస్‌పి సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పాఠశాల సందర్శన

వేపాడ: మండలంలోని అరిగిపాలెం ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాల భాస్కరరావు బుధవారం సందర్శించారు. పాఠశాల ఆవరణ విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీను పరిశీలించి విద్యార్థులతో ఇంగ్లీషు తెలుగు టెస్ట్ బుక్‌లో పాఠాలు చదివించారు. పాఠశాల ఆవరణంతో పరిశుభ్రంగా ఉంచాలని పచ్చదనాన్ని పెంచాలని క్రమం తప్పకుండా విద్యార్థులు పాఠశాలకు వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు.

'విజన్-2047' పై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి- డెంకాడ

రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా తీసుకొచ్చిన విజన్ 2047 కార్యక్రమానికి అనుగుణంగా, నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి బుధవారం అధికారులతో ముంజేరులోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గానికి చెందిన అన్ని శాఖల అధికారులూ హాజరై, తమ శాఖల పరిధిలో జరుగుతున్న పనుల వివరాలు ఎమ్మెల్యేకి వివరించారు. గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, విద్య, రవాణా, తాగునీటి సమస్యలు, మహిళా సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, పథకాల అమలు వంటి ప్రధాన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 'విజన్ 2047 అనేది రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే మాస్టర్ ప్లాన్ అన్నారు ఇందులో మన నియోజకవర్గం ముందుండాలంటే ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలన్నారు. అధికారులు తమ విధులను నిజాయతీగా నిర్వర్తిస్తూ, ప్రజలతో నేరుగా సంబంధం కలిగి, వారిని నమ్మకంతో ముందుకు తీసుకెళ్లాలన్నారు. తన పరిపాలనలో పారదర్శకత, సమర్థత, ప్రజల సమస్యలపై వేగవంతమైన స్పందన ముఖ్యమని చెప్పారు. సమావేశం ముగింపులో అధికారులు తమ శాఖల పరిధిలో తక్షణం చేపట్టే చర్యలపై వివరణ ఇచ్చారు.

నట్టల నివారణ మందులు వేస్తున్న ఎమ్మెల్యే మాధవి

పశుపోషణ అభివృద్ధికి తోడ్పాటు

పశుపోషణ అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని సింగవరంలో బుధవారం నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మేకలు, గొర్రెలకు నట్టల నివారణ వ్యాక్సిన్‌లు, మందులను నేరుగా వేశారు. ఈ కార్యక్రమంలో పశువర్ధక శాఖ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- కొత్తవలస

మండల వ్యవసాయాధికారి కెవి రాంప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం చింతలపాలెం, దేశపాత్రునిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ వరిలో విత్తనశుద్ధి గురించి రైతులకు వివరించారు. విత్తనశుద్ధి కోసం సుడోమోనస్, లేదా కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజం మందుని 24 గంటల ముందు కలిపి నీడలో ఉంచి నారుమడిలో చల్లుకోవాలన్నారు. నారుమడిని 10 రోజుల వ్యవధిలో 3 సార్లు దుక్కి దున్నించి, నీటి యాజమాన్యం సక్రమంగా నిర్వహించటానికి కాలువలు కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఎఇఒ గణేష్, ఎంపిఇఒ కుమారి, పశు వైద్యాధికారి అరుణ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: మండలంలోని జక్కువ రైతు సేవా కేంద్రంలో బుధవారం వ్యవసాయ సిబ్బందికి, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి, పురుగుల మందుల డీలర్లతో గజపతినగరం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎ.నిర్మలా జ్యోతి సమావేశమయ్యారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై వివరించారు. రైతులకు ఎప్పటికప్పుడు సిబ్బంది అందుబాటులో వుంటూ సలహాలు సూచనలు ఇవ్వాలని చెప్పారు. పురుగుల మందుల డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలని, నిభందనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గోకులకృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: విత్తన శుద్ధితో చీడ పీడలు దూరమవుతాయని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కోటిబాబు అన్నారు. మండలంలోని ఎస్.కోట, వినాయకుపల్లి సంత, గైరంపేట గ్రామాలలో సమూహంగా వరి విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి ఎలా చేయాలో బుధవారం రైతులకు వివరించామన్నారు. శుద్ధి చేసుకోవడం వల్ల తెగుళ్ళను తట్టుకునే గుణం చీడిపీడలు తట్టుకునే గుణం ఉంటదని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ డి.కృష్ణ రైతులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను రద్దు చేయడం అన్యాయం

ప్రజాశక్తి- రేగిడి

కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేయడం అన్యాయమని, వాటి జోలికి వస్తే ఊరుకునేది లేదని సిఐటియు జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి పి.శంకర్రావు, కె.సురేష్ అన్నారు. బుధవారం ఉంగరాడమెట్ట సిఐటియు మండల కమిటీ ప్రతినిధి ఎం.త్రినాథ అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకురావడం దురదృష్టకరమన్నారు. లేబర్ కోడ్స్ అమలైతే కార్మికులకు ఉన్న అన్ని హక్కులూ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. సంఘాలకు అతీతంగా అందరు కార్మికులూ ఐక్యమై, ఈ లేబర్ కోడ్స్ రద్దు కోసం కార్మిక వ్యతిరేక విధానాలు పైన పెద్ద ఎత్తున జూలై 9వ తేదీన చేపట్టనున్న సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేసి పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్, కార్డులు ఇవ్వాలని. వీఆర్ఏ, గ్రీన్ అంబాసిడర్స్, మధ్యాహ్న భోజనం, స్కూల్ ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు సుజాత, జగన్, రవిశంకర్, నాగేశ్వరరావు, గౌరమ్మ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి సురేష్

బాధ్యతాయుతంగా పని చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కమిషనర్ నల్లనయ్య

స్థాన చలనాలు జరిగిన పిమ్మట అడ్మిన్ కార్యదర్శులు తమ విధులు పట్ల మరింత బాధ్యతాయుతంగా, చురుకైన పాత్రను పోషించాలని కమిషనర్ పల్లి నల్లనయ్య అడ్మిన్ కార్యదర్శులకు నిర్దేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అడ్మిన్ కార్యదర్శులతోనూ, రెవెన్యూ సిబ్బందితోనూ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలతో పాటు రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నిర్దేశించిన ప్రాంతాల్లోనే వీధి విక్రయాలు : కమిషనర్

నగరంలో నిర్దేశించిన జోన్లలో మాత్రమే వీధివిక్రయాలు సాగించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య చిరు వ్యాపారులకు సూచించారు. బుధవారం తోపుడు బండ్ల వర్తకులు ఆయన ఛాంబర్లో కలిసి చిరు వ్యాపారాలను యథావిధిగా కొనసాగించేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర క్రమబద్ధీకరణ చర్యలలో భాగంగా నూతన విధానాలను అవలంభించబోతున్నట్లు చెప్పారు. నగరంలో రెడ్ జోన్, అంబర్ జోన్, గ్రీన్ జోన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిర్దేశిత సమయంలో మాత్రమే చిరు వ్యాపారాలు చేసుకునే వెసులు బాటును కల్పిస్తూ అంబర్ జోన్లను, నిత్యం చిరు వ్యాపారుల సాగించుకునేందుకు గ్రీన్ జోన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రదేశాలను నిర్ణయించినట్లు చెప్పారు.

చిల్లంగి నెపంతో మహిళ హత్య

ప్రజాశక్తి-బొబ్బిలి

చిల్లంగి నెపంతో సొంత పిన్నిను హత్య చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పట్టణంలోని బండారువీధిలో నివాసముంటున్న కె.సంతోష్ తన భార్యకు ఆరోగ్యం బాగోకపోవడంతో తన భార్యకు వరసకు పిన్ని అయిన కె..పద్మ చిల్లంగి పెట్టిందని నెమపంతో కత్తితో దాడి చేసి హత్య చేశారు. రక్తపు మడుగులో ఉన్న మహిళను స్థానికులు చూసి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. చిల్లంగి నెపంతో హత్య చేసినట్లు స్థానికులు చెప్పగా కత్తిపీటపై పడిపోవడం వల్ల మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెపుతున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. బొబ్బిలి పట్టణంలోని పెద్ద చాకలి వీధికి కూడలికి చెందిన పద్మ బుధవారం సాయంత్రం ఇంటిముందు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పోలీసులు అనుమానస్పదం వ్యక్తం చేస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులను విచారిస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

గజపతినగరం రైల్వే కాలనీలో దొంగతనం జరిగిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. గజపతినగరం ఎస్ఐ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రైల్వే కాలనీలో నివాసముంటున్న పాండ్రంకి పార్వతి ఇంటిలో దొంగతనం జరిగిందని తెలిపారు. ప్రస్తుతానికి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇంటి యజమాని పార్వతి హైదరాబాదులో ఉండటంతో పూర్తి సమాచారం త్వరలో తెలియజేస్తామన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపాలిటీలో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు ఆదేశించారు. పారిశుధ్య పనులపై మున్సిపల్ కార్యాలయంలో బుధవారం శానిటేషన్ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. వర్షాలు కురవడంతో కాలువలలో పూడికలు పేరుకుపోకుండా చూడాలని సూచించారు. దోమలు నివారణకు ఫాగింగ్ చేయాలని, కాలువలలో మలాతిన్ స్ప్రే చేయలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని పూతికపేట గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన జనసేన నాయకులు పతివాడ శ్రీనివాసరావు, యడ్ల గోవింద్ గ్రామ పెద్దల సహాయంతో సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నిఘా నేత్రాలు ఏర్పాటు చేయడం వల్ల గ్రామాల్లో తిరిగే అపరిచితుల సమాచారంతో పాటుగా, నేరస్తులు ఆచూకీ దొంగతనాలు నిరోధించడానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.

బహిరంగ ప్రకటన

మెసర్స్ శ్రీ వెంకట సాయి గ్రానైట్స్, వారికి సర్వే నంబరు: **108,** పెదబొండపల్లి గ్రామం, పార్వతిపురం మండలం, విజయనగరం జిల్లాలో గల, హెక్టార్లు **4.610 కలర్ గ్రానైట్ మైన్‌కు** ఎన్విరాన్‌మెంటు ఇంపాక్ట్ అస్సెస్‌మెంట్ అధారిటి **(SEIAA)** నుండి ఆర్డర్ నంబరు: **SEIAA/AP/VZM/MIN/03/2022/4003/182.33 & 179.26,** తేది: **01-04-2022** మరియు సవరించిన తదుపరి ఆర్డర్ నెంబరు: **SEIAA/AP/MIN/VZM/8/2021/3441/216.06 & 213.03,** తేది: **06-05-2023** ద్వారా అనుమతి లభించడమైనది. ఈ అనుమతి ప్రతులు పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ **(MoEF & CC)** వెబ్‌సైట్ నందు లభించును.

మెసర్స్ శ్రీ వెంకట సాయి గ్రానైట్స్ | పెదబొండపల్లి గ్రామం, పార్వతిపురం మండలం, విజయనగరం జిల్లా.

NOTICE

Please take notice that my client Sri. Gottumukkala Venkata Ramaraju s/o late Sitaramaraju, flat No.302, Sri Karthika Manasa Apartment, Dharmapuri, Vizianagaram Town & District has lost his sale deed document no.280/2004, Dt.23-01-2004 registered in the office of S.R.O.,Vizianagaram while he is going from his house on Dt. 17-06-2025 towards ring road. If any one found the document please return the same to above address. If anybody misuses the lost document, he will be punishable according to law.

Shaik Rahim. MA,M.L.
ADVOCATE, VIZIANAGARAM
Ph. 9440540386.

మహారాజశ్రీ గజపతినగరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)
I.A. 284/23 O.S.70/22

కెనరా బ్యాంకు గజపతినగరం....పిటీషనరు/వాది
మిత్తిరెడ్డి గురునాయుడు (Died) వగైరాలు
......రెస్పాండెంట్స్/ప్రతివాదులు

R2. మిత్తిరెడ్డి శ్రీనివాసరావు S/o Late గురునాయుడు, భూపాలరాజపురం, దత్తిరాజేరు మండలం, విజయనగరం జిల్లా

R3. తుంపల్లి పార్వతి W/o సత్యనారాయణ, ఎం.లింగాలవలస, దత్తిరాజేరు మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది చనిపోయినందున వాది మీ ఇరువురును చనిపోయిన ప్రతివాది యొక్క వారసులుగా చేర్చుతూ పిటీషన్ దాఖలు చేసి యున్నందున మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల మీరు స్వయంగా గాని మీ వకీలు ద్వారా గాని పై కోర్టులో **తే 21-07-2025దీన గం॥ 10-30లకు** హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలసినది ఈ నోటీసు మూలంగా తెలియజేయడమైనది. అట్లు కానిచో మీ పరోక్షంలో ఉత్తర్వులు జారీ చేయబడును.

తొత్తడి దేవుడు
వాది న్యాయవాది.
విజయనగరం,
సెల్ : 9247545988